క్లుప్తంగా...

ఓటర్లను చైతన్య పరిచేందుకే ఫ్లాగ్ మార్చ్



కుషాయిగూడ: ఓటర్లను చైతన్య పరిచేందుకే ఎన్నికల సమయంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తామని కుషాయిగూడ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. మంగళవారం చర్లపల్లి పోలీసులు చర్లపల్లిలో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌ను కుషాయిగూడ ఏసీపీ రవీందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. చర్లపల్లి, ఈసీనగర్ మీదుగా ఈ ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

మల్కాజిగిరి: ద్విచక్ర వాహన దొంగను మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. డీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బాబుదాస్ అలియాస్ దాస్(45) మల్కాజిగిరిలో కూరగాయలు విక్రయిస్తుంటాడు. ఈ నెల 26వ తేదీన యాదవనగర్‌కు చెందిన శశిధర్ తన బైక్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు మీర్జాలగూడలో వాహనాల తనిఖీల సమయంలో దాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో మరో రెండు వాహనాలు చోరీకి చేసినట్లు ఒప్పుకోవడంతో అతడి వద్ద నుంచి వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఉప్పల్ ఆర్వో అభిషేక్ అగస్త్య (ఐఏఎస్)తో ఇంటర్వ్యూ..

3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ..

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా.. ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప్పల్ నియోజకవర్గ ఆర్వో అభిషేక్ అగస్త్య (ఐఏఎస్) తెలిపారు. ఓటరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీలైనా నిబంధనలకు లోబడి నడవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఉప్పల్ ఎన్నికల ఏర్పాట్లపై ఆయన ప్రత్యేకంగా సాక్షి ఇంటర్వ్యూ.. – ఉప్పల్

సాక్షి: ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయి?

ఆర్వో: కాప్రా సర్కిల్, ఉప్పల్ సర్కిల్ కలిపి మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

సాక్షి: నియోజకవర్గంలో ఎన్ని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి?

ఆర్వో: దాదాపు 159 వరకు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

సాక్షి: సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆర్వో: సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. వెబ్ కాస్టింగ్ లైవ్ ఉంటుంది. మైక్రో అబ్జర్వర్ టీం పర్యవేక్షిస్తుంది. అదనపు బలగాలు మోహరించి ఉంచుతాం.

సాక్షి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు అనగా..

ఆర్వో: గత ఎన్నికల్లో 90 శాతానికి పైగా ఓటింగ్ శాతం నమోదైన కేంద్రాలు, 75 శాతానికి పైగా ఒకే పార్టీకి ఓట్లు పోలైన కేంద్రాలు, అధిక ఓట్ల తొలగింపు కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తిస్తున్నాం.

సాక్షి: ఇప్పటి వరకు సి–విజిల్ యాప్ ద్వారా ఎన్ని ఫిర్యాదులు నమోదయ్యాయి?

ఆర్వో: దాదాపుగా 10కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తీసుకెళ్తున్న నగదును ఎంత స్వాధీనం చేసుకున్నారు.?

ఆర్వో: ఇప్పటి వరకు రూ.1,59,09,371 నగదును స్వాధీనం చేసుకున్నాం. వాటిలో రూ.87,74,130 వరకు ట్రెజరీకి పంపగా, రూ.71,35,241లను ఐటీ డిపార్టుమెంట్‌కు అప్పగించినట్లు తెలిపారు.



ఉప్పల్ ఆర్వో అభిషేక్ అగస్త్య(ఐఏఎస్)

సాక్షి: నామినేషన్ల ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది?

ఆర్వో: ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన ప్రక్రియ ప్రారంభమవుతుంది. అభ్యర్థి వెంట కేవలం నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది.

సాక్షి: నామినేషన్లను ఎప్పటి వరకు స్వీకరిస్తారు?

ఆర్వో: నామినేషన్లను ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరిస్తాం.. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించేది లేదు.

సాక్షి: పొలిటికల్ పార్టీలకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

ఆర్వో: ర్యాలీలు, సభలు, సమావేశాలకు విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అందుకు అన్ని పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.

3వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తాం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అర్వో అభిషేక్ అగస్త్య

ఉప్పల్: వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్య సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 3వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆర్వో తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో నామినేషన్లను స్వీకరించబోమని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థి ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని సూచించారు. అభ్యర్థి నామినేషన్‌తో పాటు రూ.10 వేలను డిపాజిట్ చేయాలని, రిజర్వేషన్లు వర్తించే వారు రూ.5 వేలను డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుందన్నారు. పోటీ చేయనున్న ప్రతి అభ్యర్థి నామినేషన్‌తో పాటు ఫారం–6, ప్రమాణ పత్రం, చిహ్నాల కేటాయింపు తదితర వాటిని పూర్తిచేసి ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థి ఫారం–ఏ, బీలను సమర్పించాలన్నారు. పోటీ చేయనున్న ప్రతి అభ్యర్థి కరప్రతాలు, పోస్టర్లపై నిర్దిష్ట ప్రింటర్ల చిరునామా అచ్చు వేయించాలని సూచించారు. ఎన్నికల వ్యయం, రాజకీయ నాయకుల సందేహాలు, ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన వాటిని వివరించారు. ఎలాంటి సందేహాలున్నా నేరుగా తమను సంప్రదించాలని ఆయన కోరారు.

బీఎల్ఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



బీఎల్ఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ఎన్‌టీఆర్‌నగర్ చెందిన యువకులు

కుషాయిగూడ: ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పలు పార్టీలకు చెందిన యువకులు ఆయనకు మద్దతుగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన 100 మంది యువకులు కార్పొరేటర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, వంజరి ప్రవీణ్, గుమ్మడి జంపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి



సంతోష్‌నగర్‌లో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: సీఎం కేసీఆర్ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారని బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంతోష్‌నగర్ కాలనీలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మల్కాజిగిరి సర్కిల్ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్.జితేందర్‌రెడ్డి, బద్దం పరుశురాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ టీఎన్. క్రిష్ణగౌడ్, హుడా మాజీ డైరెక్టర్ వీరేశం యాదవ్, వెంకన్న, నాయకులు మేకల రాముయాదవ్, వేణునాయుడు, పీవీ సత్యనారాయణ, లక్ష్మీ పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం



ప్రచారంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వసంతపురి కాలనీలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలన అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రజా శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలను ప్రకటించిందని, ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మైనంపల్లి వాణి, ఉమేష్‌సింగ్, జీఎన్వీ సతీష్‌కుమార్, సత్యమూర్తి, వెంకటేష్‌యాదవ్, బీకే శ్రీను పాల్గొన్నారు.

నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తా..



కుషాయిగూడ హోల్‌సేల్ మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ముమ్మర ప్రచారం చేశారు. మంగళవారం ఈసీఐఎల్ గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను కలిసి మద్దతు కోరారు. కుషాయిగూడ హోల్‌సేల్ మార్కెట్‌ను సందర్శించారు. ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానంటూ ప్రచారం సాగించారు. కాంగ్రెస్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, సీతారాంరెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్ గుప్త, రమకాంత్‌రెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి



ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్‌లోని గాంధీనగర్, కనకదుర్గ ఫేస్–1, 2, 4, అణుశక్తినగర్, శ్రీహరినగర్, కాకతీయకాలనీ, జయశ్రీరాం కాలనీల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ అసెంబ్లీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, యూత్ అధ్యక్షులు కొత్త సుకాంత్‌గౌడ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, నేతలు మేకల యాదగిరి, గణేష్‌నాయక్, ఉమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, సంపత్, సోమేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కుషాయిగూడ ఎన్ఎఫ్‌సీ గ్రౌండ్స్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివాస్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది



అల్వాల్ లయోల అకాడమీలో పటేల్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మల్కాజిగిరి ఎస్పీనగర్‌లో పటేల్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్



అల్వాల్‌లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్కాజిగిరి చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘన నివాళి

సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజలు పెద్దఎత్తున నివాళులర్పించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహాలకు నివాళులర్పించారు. మాజీ ప్రధానిగా ఆమె అందించిన సేవలను కొనియాడారు.

ఏఎస్‌రావుకు నివాళి



ఈసీఐఎల్ వద్ద డాక్టర్ ఏఎస్‌రావుకు నివాళులర్పిస్తున్న బీఎల్ఆర్

కుషాయిగూడ: ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఎస్‌రావు వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఏఎస్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంతోమందికి ఉపాధి కల్పించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత నేతగా అభివర్ణించారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావనిరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ



అల్వాల్: ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ డీసీపీ శబరీష్ అన్నారు. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మచ్చబొల్లారం, అల్వాల్, లోతుకుంటలోని పోలింగ్ కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు



ర్యాలీలో కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ నుంచి డెకాత్లన్ వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు రితేష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి జాతీయ భావాలు, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. అంతేగాకుండా దేశ సమగ్రత, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ సమైక్యతను చాటుతూ నాటక, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్ రోడ్డుపై వైన్స్ తొలగించండి



వినతి పత్రం అందజేస్తున్న అంబేడ్కర్‌నగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు

అల్వాల్: సైనిక్‌పురి చౌరస్తా నుంచి వాయిపురికి వెళ్లే ప్రధాన రోడ్డు అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న వైన్స్ షాపు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు మంగళవారం ఎక్సైజ్ అధికారులు, నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీకి ఇరువైపులా రోడ్డుపై ఉన్న వైన్స్ షాపు వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మద్యం మత్తులో రోడ్లపై మలమూత్ర విసర్జన చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇద్దుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, దానివల్ల రాకపోకలు సాగిస్తున్న కాలనీవాసులు పాట్లు పడుతున్నారన్నారు. వైన్స్ సమీపంలోనే గుడి, మసీద్, పాఠశాల సైతం ఉందన్నారు. అధికారులు స్పందించి వైన్‌షాపును తొలగించాలని, కొత్త వైన్‌షాపునకు అనుమతి ఇవ్వొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశామన్నారు. అంబేడ్కర్‌నగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు దేవేందర్‌రెడ్డి, డానియల్, ఇస్మాయిల్, అక్బర్ తదితరులు ఉన్నారు.

మల్లారెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం



ఇంటింటి ప్రచారంలో మంద సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం 1వ డివిజన్ పరిధిలో బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని ఓటర్ల అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు జడిగె రమేష్‌యాదవ్, ఏనుగు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయం

మల్కాజిగిరి: ఎంపీ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి గర్హనీయమని మల్కాజిగిరి అసెంబ్లీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈస్ట్ ఆనంద్ అనంత సరస్వతి నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన విష సంస్కృతి బయట పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎంపీగా రెండుసార్లు ఉన్న ప్రభాకర్‌రెడ్డిపై దాడిని రేవంత్‌రెడ్డి డ్రామాగా చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల్లో పోటీ ఉన్నప్పుడు గౌరవంగా ఓట్ల అభ్యర్థించాలే.. కానీ ఇటువంటి దాడులకు పాల్పడితే మరోసారి తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్ మురుగేష్, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, జగదీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్, ఎన్నికల ఇన్‌చార్జి జితేందర్ రెడ్డి, జేఏసీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





కౌకూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం నిర్వహిస్తున్న ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్



వాణీనగర్‌లో బీఆర్ఎస్ ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

టూ వీలర్ మెకానిక్స్‌కు అండగా ఉంటా..

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలోని టూ వీలర్ మెకానిక్స్‌కు అండగా ఉంటానని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు బీఎల్ఆర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ మంగళవారం హెచ్‌బీకాలనీలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. హాజరైన బీఎల్ఆర్ మాట్లాడుతూ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ భవన నిర్మాణానికి కావాల్సిన సహకారం అందజేస్తానన్నారు. సేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అందరి సంక్షేమానికి పెద్దపీట వేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, గుమ్మడి జంపాల్‌రెడ్డి పాల్గొన్నారు.